## క్లుప్తంగా

### 27న స్పందన

**వెదురుకుప్పం:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్పందన కార్యక్రమాన్ని ఈ నెల 27న బుధవారం వెదురుకుప్పంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతులను అర్జీల రూపంలో స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాస్థాయి అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### పోషకాహారంపై అవగాహన



ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న విద్యార్థులు

**నగరి:** పోషకాహారంపై ఎస్‌వీవీపీ యాజమాన్యం వారు విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పట్టణ పరిధిలోని తలారివీధిలో ఉన్న ఒక ప్రైవేటు పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. పలు రకాల వంటకాలను ప్రదర్శనగా ఉంచిన వారు ఆధునిక వంటలు, ప్రాచీన వంటలను వారికి సూచిస్తూ పోషకాహారం తీసుకోవడం ద్వారా కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఫుడ్‌ఫెస్టివల్ నిర్వాహకులు పెరుమాళ్, సిబ్బంది పాల్గొన్నారు.

### నాడు-నేడు పనులపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

**పాలసముద్రం:** మండలంలో నాడు-నేడు పథకంలో ఎంపికైన పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం ఎమ్మార్సీ ఆవరణలో నాడు-నేడు పథకంలో ఎంపికైన స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతుల కోసం నాడు-నేడు పథకంలో మంజూరైన అదనపు భవనాలు, మరుగుదొడ్లు వంటి పనులను త్వరగా పూర్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఉందని తెలిపారు. ముఖ్యంగా పనుల్లో నాణ్యత తప్పక పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎంలు మనోహర్‌నాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ యశ్వంత్ పాల్గొన్నారు.

### కమనీయం.. శ్రీవారి గ్రామోత్సవం



తిరుచ్చి వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

**పుత్తూరు రూరల్:** అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. పెరటాసి నెల తొలి శనివారం కావడంతో భక్తులతో ఆలయం కిటకిటలాడింది. పెద్దసంఖ్యలో భక్తులు తలనీలాలు సమర్పించి, స్వామివారిని దర్శించుకున్నారు. వేకువజామున సుప్రభాత సేవతో శ్రీనివాస స్వామిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తికీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్‌సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరీలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి చేరుకున్న స్వామి, అమ్మవార్లకు అర్చకులు మంగళ హారతులు ఇచ్చారు. కార్యక్రమాలను ఆలయ అర్చకులు రమణాచార్యులు, ఆలయ అధికారి శివకుమార్ పర్యవేక్షించారు.

### వేడుకగా ఊంజల్ సేవ

**నాగలాపురం:** మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంగా ఉన్న శ్రీ వేదవల్లి సమేత శ్రీ వేదనారాయణ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెరటాసి నెల మొదటి శనివారం సందర్భంగా సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చి ఊంజల్ సేవను వేడుకగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

నియోజకవర్గ స్థాయి కబడ్డీ జట్టుతో ఎంఈఓలు, నియోజకవర్గస్థాయి త్రోబాల్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్ జట్లతో హెచ్‌ఎం, టీచర్లు





# హోరాహోరీగా స్కూల్ గేమ్స్

- క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం
- రసవత్తరంగా కబడ్డీ, త్రో బాల్, టెన్ని కాయిట్, బ్యాడ్మింటన్ పోటీలు
- బాలురతో సమానంగా తలపడుతున్న బాలికలు
- ప్రతిభ ఆధారంగా నగరి నియోజకవర్గ స్థాయి జట్ల ఎంపిక



ఉత్సాహంగా త్రోబాల్ ఆడుతున్న బాలికలు

**క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. గ్రామస్థాయిలో ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించడంతో పాటు అధికారులు వారిని ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భాగంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ద్వారా ప్రస్తుతం క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు.**

**నగరి:** రాష్ట్రప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. దీంతో గత నాలుగేళ్లుగా స్కూళ్లు, కళాశాలల్లోని మైదానాలు క్రీడాకారులతో కళకళలాడుతున్నాయి. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడం ద్వారా ఒక స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది. వీటిని పరిగణనలోకి తీసుకున్న ప్రస్తుత ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోంది. దీనికి తోడు క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా పలు గ్రామాల్లో క్రీడాకారులకు కావలసిన సామగ్రిని ఉచితంగా అందజేసి క్రీడలను మరింత ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఏపీసీఎం కప్, జగనన్న క్రీడా సంబరాలు, శాప్ ద్వారా క్రీడా పోటీలు, రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా క్రీడా పోటీలు ఇలా పలు దఫాలుగా క్రీడా పోటీలు నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు కోలాహలంగా జరుగుతున్నాయి. ఈ పోటీల్లో భాగంగా శనివారం నియోజకవర్గస్థాయి అండర్-14, అండర్-17 బాల బాలికలకు త్రోబాల్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్ క్రీడల పోటీలు నిర్వహించి నియోజకవర్గ స్థాయి జట్టును ఎంపిక చేశారు. బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం, హెచ్‌ఎంలు పార్వతీదేవి ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించగా, ఏకాంబరకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నమశ్శివాయం ఆధ్వర్యంలో త్రోబాల్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు.



కబడ్డీలో తలపడుతున్న బాలికలు

**భారీగా పాల్గొన్న క్రీడాకారులు..**

స్కూల్ గేమ్స్ పోటీలకు పుత్తూరు, నగరి, వడమాలపేట, నిండ్ర, విజయపురం మండలాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలురతో పోటీ పడుతూ బాలికలు కూడా అధిక సంఖ్యలో ఈ పోటీలకు హాజరయ్యారు. దీంతో మైదానాలు క్రీడాకారులతో సందడిగా కనిపించింది. నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎస్.మణి, మండల కోఆర్డినేటర్లు నందకుమార్, గుర్రప్ప, సుబ్రహ్మణ్యం, చెన్నకేశవులు, వ్యాయామ ఉపాధ్యాయులు రాజేశ్వరి, చంద్రమ్మ, సునీత, మోహన్ బాబు, సురేష్, గీతమ్మ, స్వప్న, సుజాతమ్మ, కవిత, గోపి, సుమన్, చంద్ర పకడ్బందీగా పోటీలు నిర్వహించి నియోజకవర్గ స్థాయి జట్టు ఎంపికలో న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

**నియోజకవర్గ స్థాయి జట్టుకు ప్రసంశలు..**

కబడ్డీ, త్రో బాల్, టెన్ని కాయిట్, బ్యాడ్మింటన్ పోటీలకు గాను నియోజకవర్గస్థాయిలో ఎంపికైన జట్టును ఎంఈఓలు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్ బాబు ప్రశంసించారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికై నియోజకవర్గానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## టీడీపీ ఎమ్మెల్యేల తీరు అప్రజాస్వామికం

**వెదురుకుప్పం:** అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరు అప్రజాస్వామికమని ఏఎంపీ మాజీ ఉపాధ్యక్షుడు ఎం.రామయ్య అన్నారు. శనివారం సాయంత్రం వెదురుకుప్పంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీలో ప్రజాసమస్యలపై చర్చించకుండా సభ జరగకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. దేవాలయం లాంటి అసెంబ్లీలో విజిల్స్ వేసుకుంటూ సభా గౌరవానికి భంగం కలిగించడాన్ని ప్రజలు చీదరించుకున్నట్లు చెప్పారు. అలాగే ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామిపై టీడీపీ ప్రజాప్రతినిధులు అవాకులు, చవాకులు పేలడం సరికాదన్నారు. నిరంతరం ప్రజల కోసం నిస్వార్థంతో పనిచేస్తున్న మంత్రి నారాయణస్వామిని ప్రజల నుంచి దూరం చేయలేరని స్పష్టం చేశారు. సమావేశంలో బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజి, నాయకులు చిన్నస్వామి, జాకబ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

### అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

**కార్వేటినగరం:** మండలకేంద్రం కార్వేటినగరంలో ప్రసిద్ధి చెందిన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో మేజర్ పంచాయతీ కార్వేటినగరం పట్టణానికి చెందిన వెటర్నరీ అసిస్టెంట్ శశిధర్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ స్వామివారి దర్శనం కోసం సుదూర ప్రాంతం నుంచి వచ్చి పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఇలా ప్రతి భక్తుడు ముందుకొచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకుని తమ దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, టీటీడీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

## ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు



హాజరైన విద్యార్థులు



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర

- సుప్రీంకోర్టు మార్గదర్శకాలు విడుదల చేసింది
- సీనియర్ సివిల్‌జడ్జి రాఘవేంద్ర

**పుత్తూరు రూరల్:** ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని, ఈ మేరకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను విడుదల చేసిందని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సీ.రాఘవేంద్ర స్పష్టం చేశారు. శనివారం స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ర్యాగింగ్ వంటి వికృత చేష్టలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థిని కళాశాల నుంచి డిస్మిస్ చేయడం జరుగుతుందని, తర్వాత ఏ ఇతర కళాశాలలోనూ అడ్మిషన్ ఉండదని స్పష్టం చేశారు. కళాశాల యాజమాన్యాలు యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. భవిష్యత్‌ను నాశనం చేసే ర్యాగింగ్‌తో పాటు మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదని చెప్పారు. ర్యాగింగ్‌కు పాల్పడితే 6 నెలల శిక్ష నుంచి జీవిత ఖైదు విధించే అవకాశం ఉందని తెలిపారు. మత్తు పదార్థాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదని సూచించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపల్ జీ.శ్రీనివాసులు రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వీరయ్య పాల్గొన్నారు.

### ఈకేవైసీ తప్పనిసరి

**పాలసముద్రం:** ఈ ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు విధిగా ఈ-క్రాప్‌తో పాటు ఈకేవైసీ కూడా తప్పనిసరిగా చేయించుకోవాలని నగరి డివిజన్ ఆర్‌డీఓ సుజన తెలిపారు. శనివారం ఆమె మండలంలోని శ్రీకావేరిరాజుపురం, పాలసముద్రం పంచాయతీల్లో జరుగుతున్న పంటల నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను వ్యవసాయ శాఖ, రెవెన్యూ, వలంటీర్లు కచ్చితంగా నమోదు చేసిందీ లేనిదీ ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె సాగు చేసిన పంటల వివరాలను ఈ-క్రాప్‌లో బుకింగ్ చేశారా ? లేదా ? అని రైతులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో వ్యవసాయ శాఖ, రెవెన్యూ సిబ్బందితో కలసి 5,979 ఎకరాలు ఈ-క్రాప్ బుకింగ్ చేశారు. రైతు భరోసా కేంద్రాల్లో సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్ బాబు, తహసీల్దార్ బాబు, ఏఓ డిల్లీ ప్రసాద్, వీఆర్‌ఓ తంగరాజ్, వ్యవసాయ సహాయకులు వనజ, వీఆర్‌ఏ మునస్వామి పాల్గొన్నారు.

## గోవింద భక్తులకు అన్నదానం

**వెదురుకుప్పం:** తమిళనాడు రాష్ట్రం నుంచి తిరుమలకు వెళ్లే గోవింద భక్తులకు పెరటాసి నెల సందర్భంగా వెదురుకుప్పం ఎంపీపీ నాగరాణి భర్త వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి అన్నప్రసాదం వితరణ చేయనున్నారు. తమిళనాడు నుంచి పచ్చికాపల్లం మీదుగా కాలినడకన భక్తులు తిరుమలకు వెళ్తుంటారు. పచ్చికాపల్లంలోని రాయల మండపంలో ప్రతి రోజూ భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాదాన్ని అందుబాటులో ఉంచనున్నట్లు దాత తెలియజేశారు. ఈమేరకు శనివారం ఉదయం ఏకవీర సేవా ఫౌండేషన్ నిర్వాహకులు ప్రతాప్ స్వామి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బండి గోవర్ధన్‌రెడ్డి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తన సొంత నిధులతో పెరటాసి నెలలో 30 రోజుల పాటు భక్తులకు అన్నదానం చేసేందుకు సంకల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గుణశేఖర్, మునిచంద్రారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బండి రోశిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న నాయకులు

### పండ్ల తోటల పరిశీలన



చీనీ తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత రామ్

**గంగాధరనెల్లూరు:** మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామంలో రైతు సాగు చేసిన చీనీ, డ్రాగన్ ఫ్రూట్ తోటలను ఏరువాక కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త రెడ్డి రామ్, విస్తరణ శాస్త్రవేత్త రాఘవేంద్ర రెడ్డి శనివారం క్షేత్రస్థాయిల్లో పరిశీలించారు. చీడపురుగుల నివారణకు రోగర్ 1 లీటర్, వేపనూనెను ఒక లీటర్‌ను నీటిలో కలుపుకుని పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వందన, వ్యవసాయ సహాయకులు చక్రవర్తి, శిరీష పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి

**పాలసముద్రం:** మండల పరిధిలోని రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను సాగు చేయడం వల్ల రసాయనాల వాడకం ఉండదని, జీవామృతం, కషాయాలతో సాగు చేయడంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చిత్తూరు ఏపీపీఎస్‌ఎఫ్ డీపీఎం వాసు తెలిపారు. శనివారం శ్రీకావేరిరాజుపురం రైతు భరోసా కేంద్రంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చెరుకు సాగు చేయడంతో పాటు చీడపీడల నివారణ, అధిక దిగుబడుల కోసం జీవామృతం వాడకం, కలుపు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో చెరుకు పంట సాగు చేసి తద్వారా బెల్లం తయారీ చేస్తే తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా చేస్తామని, రైతులకు మార్కెట్ ధర కన్నా ఐదుశాతం ఎక్కువకు టీటీడీ కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్ బాబు, వ్యవసాయ సహాయకులు వనజ, రైతులు పాల్గొన్నారు.



రైతులకు ప్రకృతి వ్యవసాయం గురించి వివరిస్తున్న ఏపీపీఎస్‌ఎఫ్ డీపీఎం వాసు

## దళితులంటే టీడీపీకి గిట్టదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**శ్రీరంగరాజపురం:** టీడీపీ నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల పైన ఇష్టం వచ్చినట్లు అనుచితంగా మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాలప్ప హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో చంద్రబాబు చేసిన అవినీతి, దోపిడీ గురించి మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామికి అడ్డు తగలడంతో పాటు టీడీపీ ఎమ్మెల్యేలు అనుచిత వ్యాఖ్యలు చేస్తూ దళిత ప్రజాప్రతినిధిని అవమానించిడం నీచమైన చర్య అన్నారు. దళితులంటే టీడీపీకి గిట్టదని, మొదటి నుంచి ఆ పార్టీ నేతలకు దళితులను దూషించడం, హేళన చేయడం అలవాటే అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు లాగా యువతకు నైపుణ్యం శిక్షణ పేరిట ప్రజాధనాన్ని దోపిడీ చేయలేదన్నారు. అమరావతి భూకుంభకోణం, ఫైబర్‌నెట్, రింగురోడ్డు, ఇసుక దోపిడీ లాంటి అక్రమాలకు పాల్పడలేదన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటం రెడ్డి శ్రీనివాసులురెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి మణి, మండల అధికార ప్రతినిధి తయ్యూరు బాబు, నాయకులు కటికపల్లి మాజీ సర్పంచ్ మణి, నాయకులు మహేష్, ఏకాంబరం, అమృతరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### సృజనాత్మకత పెంపే లక్ష్యం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

**కార్వేటినగరం:** బాలల్లో సృజనాత్మకతను పెంచేందుకే సైన్సుపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా సైన్సు అధికారి ఆర్‌వీ రమణ అన్నారు. శనివారం ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాలలో సైన్స్‌పై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని బాలల్లో సృజనాత్మకతను, విజ్ఞానశాస్త్రంపై ఆసక్తిని పెంపొందించడానికి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం కార్వేటినగరం, వెదురుకుప్పం, పాలసముద్రం, నగరి, నిండ్ర, విజయపురం మండలాల నుంచి హాజరైన గైడ్ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి విజయకుమార్, ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కోటేశ్వరరావు, జిల్లా కోఆర్డినేటర్ భువనేశ్వరి, జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ పురుషోత్తం, జిల్లా మేనేజర్ అనిత, రీసోర్సు పర్సన్స్ మురళి, నందకుమార్, వేణుగోపాల్, లలిత, సుభాషిణి, హరిబాబు పలువురు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ

**కార్వేటినగరం:** గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. శనివారం మండల పరిధిలోని గాజులకండ్రిగ గ్రామంలో రూ.14 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. అలాగే డ్రైనేజీలు ఏర్పాటులో కూడా కార్వేటినగరం మండలం మొదటి స్థానంలో ఉందని, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి చొరవతో అభివృద్ధి పనులు పరుగులు పెడుతోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంలో మీనమేషాలు లెక్కించిందని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలతో పాటు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ కేశవులు, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

### క్రీడా పరికరాల వితరణ



క్రీడాపరికరాలను అందుకుంటున్న పీడీ

**నగరి:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏకాంబరకుప్పంలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయుడు ఎస్‌డీ చంద్రశేఖర్ విద్యార్థులకు రూ.3 వేలు విలువగల క్రీడా పరికరాలను వితరణగా అందించారు. తన తండ్రి తండ్రి 11వ వర్ధంతి సందర్భంగా ఆయన వీటిని వితరణ చేశారు. క్రీడా పరికరాలను ప్రధానోపాధ్యాయులు నమశ్శివాయం చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడా పరికరాలను అందించడం ద్వారా తన తండ్రిని స్మరించుకుంటున్న ఉపాధ్యాయుడిని అభినందనలు అన్నారు. ఇలాంటి మంచి సంప్రదాయాలు సమాజంలో ఆచరణలోకి రావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల పీడీలు మణి, కార్తికేయన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### వైభవంగా పెరటాశి పూజలు



ఆలయం వద్ద అన్నప్రసాదాలు అందిస్తున్న భక్తులు

**నగరి:** మున్సిపల్ పరిధిలోని సత్రవాడ కరివరదరాజ స్వామి ఆలయంలో పెరటాశి నెల తొలి శనివారం పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా నేత అనుబంధ సంఘం అధ్యక్షుడు ఈవీ కన్నాయిరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర మొదలియార్ సంఘం డైరెక్టర్ ఈవీ బాలకృష్ణ, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బీఆర్వీ అయ్యప్పన్, బృందా, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

## 'ఆయుష్మాన్‌భవ' పేదలకు వరం



ఆయుష్మాన్ భవ పథకాన్ని ప్రారంభిస్తున్న యశోదారెడ్డి

**పెనుమూరు(కార్వేటినగరం):** ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఆయుష్మాన్‌భవ పథకం పేదలకు ఓ వరమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సూపరింటెండెంట్ గీతాకుమారి ఆధ్వర్యంలో ఆయుష్మాన్‌భవ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకం ద్వారా అన్ని రకాలైన వ్యాధులకు వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని దీర్ఘకాలిక రోగాలతో బాధ పడుతున్న వారు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, నాయకులు దూదిమోహన్, కృష్ణారెడ్డి, దాము, డాక్టర్ సీతారామరాజు, డాక్టర్ సంధ్య, వైద్యసిబ్బంది పలువురు పాల్గొన్నారు.

### ఉరుములు, మెరుపుల వర్షం



**వెదురుకుప్పం:** మండలవ్యాప్తంగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. సుమారు గంటన్నర పాటు ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. పచ్చికాపల్లం, కొమరగుంట, మాంబేడు ప్రాంతాల్లో వరిపైరు నేలకొరిగింది. మధ్యాహ్నం వరకు ఎండతీవ్రత అధికంగా ఉండగా, సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మేఘావృతమై వర్షించింది. వీధులు జలమయమయ్యాయి.